ప్రజాశక్తి
ఆదివారం 5, మార్చి 2023 5 శ్రీ సత్యసాయి



సమాజం పట్ల అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి - కదిరి టౌన్

భవిష్యత్తు తరాలను దృష్టిలో ఉంచుకొని బాల బాలికలు సమాజం పట్ల అవగాహన పెంపొందించుకోవాలని కదిరి సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు విద్యార్థినులకు సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మహిళ సదస్సును శనివారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర రావు హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన హాస్టల్‌లో భోజన సదుపాయాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు లింగాల లోకేశ్వర్ రెడ్డి, న్యాయవాదులు నరసింహులు, షాబుద్దీన్, కెజిబివి స్పెషలాఫీసర్ శ్రీ లక్ష్మి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మందులు లేవు..సిబ్బందీ లేరు..!



హిందూపురం పట్టణంలోని ఈఎస్ఐ ఆసుపత్రి

ఈఎస్ఐ ఆస్పత్రుల్లో మందుల కొరత ఏర్పడింది. ప్రభుత్వం పాత బకాయిలు చెల్లించకపోవడంతో మందులు సరఫరా చేయబోమని కంపెనీలు తెగేసి చెబుతున్నాయి. దీంతో అవసరమైన మందులు అందక కార్మికులు, ఉద్యోగులు అవస్థలు పడుతున్నారు. వ్యాధులు నయం చేసుకునేందుకు బయట మార్కెట్‌లో మందులు కొనుగోలు చేయాల్సిన దుస్థితి. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

250 రకాల మందులకు వచ్చింది 50 మాత్రమే
ఇండెంట్ పంపినా సరఫరా చేయని కాంట్రాక్టు కంపెనీలు
ఈఎస్ఐ ఆస్పత్రుల్లో ఇదీ దుస్థితి

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో హిందూపురంలో రెండు, అనంతపురం, గుంతకల్లు, తాడిపత్రిలో ఈఎస్ఐ ఆస్పత్రులు ఉన్నాయి. ఇక్కడ రోజూ సుమారు 500 మందికి పైగా కార్మికులు వైద్య సేవల కోసం వస్తుంటారు. అయితే జిల్లాలో ఎక్కడా లేని విధంగా హిందూపురం ఈఎస్ఐ అసుపత్రికి ఎక్కువ మంది రోగులు వస్తుంటారు. హిందూపురం ప్రాంతంలో దాదాపు 20 వేల మంది కార్మికులకు పైగా ఉన్నారు. ఒక్కో కుటుంబంలో నలుగురు సభ్యులను కలుపుకుంటే మొత్తం సభ్యుల సంఖ్య సుమారు 80 వేల వరకు ఉంటుంది. వివిధ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులకు ఆయా సంస్థలు తమ ఈఎస్ఐ వాటాను చెల్లిస్తాయి. దీంతో కార్మికుల కుటుంబ సభ్యులకు ఈఎస్ఐ డిస్పెన్సరీ, ప్యానెల్ క్లినిక్‌లో వైద్య సేవలు అందిస్తుంటారు. కడప కేంద్రంగానే కడప, నెల్లూరు, చిత్తూరు, కర్నూలు, అనంతపురానికి చెందిన ఈఎస్ఐ జాయింట్ ప్రాంతీయ కార్యాలయం ఉంది. 28 డిస్పెన్సరీలు ఆదోని, తిరుపతిలో, నెల్లూరు జిల్లా సూళ్లూరుపేటలో డయాగ్నోస్టిక్ సెంటర్లు ఉన్నాయి. వైద్యుల లెక్క ప్రకారం ఆస్పత్రులు, డిస్పెన్సరీలకు ఒక్కో దానికి రోజుకు 100 నుంచి 150 మంది ఈఎస్ఐ కార్డు కలిగిన కార్మికులు చికిత్స కోసం వస్తుంటారు. డిస్పెన్సరీలకు అవసరమైన మందుల ఇండెంట్‌ను కడప జేడీ కార్యాలయం నుంచే విజయవాడ కార్యాలయానికి పంపిస్తుంటారు. ఏయే మందులు అవసరమో వాటిని అక్కడి నుంచి డిస్పెన్సరీలకు సరఫరా చేస్తారు. సమస్యలను పరిష్కారించాలని డిమెండ్ చేస్తూ సిపిఎం, సిఐటియు నాయకులు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. అయినప్పటికి అధికారుల్లో చలనం లేదు. దీంతో సమస్యను ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్‌ను కలిసి వివరించారు. స్పందించిన ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

మందుల కొరత..

ప్రభుత్వం మందులు సరఫరా చేసే కంపెనీలకు బకాయిలు చెల్లించడం లేదు. దీంతో కంపెనీలు ఈఎస్ఐ ఆస్పత్రులకు అవసరమైన మందులను సరఫరా చేయడం లేదు. మూడు నెలలకు ఓ సారి ఆస్పత్రులకు అవసరమైన మందుల ఇండెంట్‌ను జేడీ ద్వారా విజయవాడలోని డైరెక్టర్‌కు పంపిస్తుంటారు. 250 రకాల మందులను డాక్టర్లు ఇండెంట్ పెడుతుంటారు. దీర్ఘకాలిక వ్యాధుల మందులతో పాటు బీపీ, షుగర్, లివర్, కిడ్నీ, గుండె సంబంధిత వ్యాధులకు సంబంధించి మందులు తెప్పిస్తుంటారు. అయితే ప్రభుత్వం కంపెనీలకు పాత బకాయిలు ఇవ్వకపోవడంతో మందుల సరఫరా నిలిచిపోయింది. 250 రకాల మందులకు గాను ఇప్పుడు కేవలం 50 రకాలు మాత్రమే వస్తున్నాయి. కార్మికులు నిత్యం వాడే బిపి, షుగర్, థైరాయిడ్ లాంటి రోగాలకు సైతం పూర్తి స్థాయిలో మందులు రావడం లేదు.

కార్మికులకు భారంగా..

చాలా మంది కార్మికులు అరకొర జీతాలు, సంపాదనతోనే కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. ఏదైనా జబ్బుచేస్తే ఈఎస్ఐ కార్డుతో చికిత్స చేయించుకోవచ్చనే భరోసా కార్మిక కుటుంబాలకు ఉంటుంది. కార్మికులతో పాటు వారి పిల్లలు, తల్లిదండ్రులకు ఉపయోగంగా ఉండేది. అయితే ఈఎస్ఐ డిస్పెన్సరీలో కూడా మందుల కొరత ఉండడం కార్మికులను కలవరపాటుకు గురిచేస్తోంది. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు మందులు ఇంజెక్షన్ల కోసం సుమారు రూ.2 నుంచి రూ.3 వేల విలువజేసే మందులను ఉపయోగిస్తుంటారు. వీరు క్రమం తప్పకుండా రోజూ మందులు వేసుకోవాల్సి ఉంది. అయితే ఇప్పుడు ఈఎస్ఐలో మందుల కొరత కారణంగా బయట మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సిరావడం కార్మికుల కుటుంబాలకు భారంగా మారుతోంది. ఇక్కడ సరైన వైద్యం అందక పోవడంతో ఇతర అసుపత్రుల్లో వైద్య సేవలు పొందితే దానికి సంబంధించిన బిల్లులు ఆరు నెలలు గడిచినా మంజూరుకావడం లేదు. ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ అసుపత్రుల్లో ఈఎస్ఐ కార్డు ఉన్న వారికి వైద్య సేవలు అందించలేమని తెగేసి చెబుతున్నట్లు కార్మికులు పేర్కొంటున్నారు. దీనికి కారణం ఈఎస్ఐ వైద్య సేవలకు సంబందించి సకాలంలో బిల్లులు మంజూరు కాక పోవడమే. ప్రతి నెలా కార్మికులు ఈఎస్ఐ కోసం డబ్బులు చెల్లించినప్పటికీ వైద్య సేవల కోసం అప్పులు చేసి మోయలేని భారాన్ని మోయాల్సి వస్తోంది.

మందులే కాదు..సిబ్బందీ లేరు..

హిందూపురం ఈఎస్ఐ అసుపత్రిలో మందుల కొరతే కాదు.. సిబ్బంది కొరతా వేదిస్తోంది. హిందూపురం, కొట్నూరుకు సంబంధించి రెండు డిస్పెన్సరీలనూ ఒకే చోట నిర్వహిస్తున్నారు. ఇద్దరు వైద్యులు ఉన్నప్పటికీ నర్సింగ్, ల్యాబ్ టెక్నీషియన్, ఎంఎన్‌ఒతో పాటు క్లాస్-4కు సంబంధించి అన్ని పోస్టులూ ఖాళీగా ఉన్నాయి. దీంతో పాటు కార్యాలయంలో ఉండాల్సి సీనియర్ అసిస్టెంట్లు సైతం లేరు. రోగులతో పాటు వైద్యులు కూడా ఇబ్బంది పడుతున్నారు.

సౌకర్యాలు మెరుగుపరచాలి..



జిల్లాలో కార్మికుల కోసం ఉండే ఒకే ఒక అసుపత్రి ఈఎస్ఐ హాస్పిటల్. ఈ అసుపత్రిలో మందులే కాదు.. సిబ్బంది కూడా లేకపోవడంతో కార్మికులకు నాణ్యమైన వైద్య సేవలు అందడం లేదు. వెంటనే పూర్తి స్థాయి సిబ్బందిని నియమించి అవసరమైన మందులు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలి. అసుపత్రిలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి. లేని పక్షంలో కార్మికులతో కలిసి పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం అవుతాం.

- ఈఎస్ వెంకటేష్, సిఐటియు జిల్లా కార్యదర్శి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి,

8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం

హాజరు కానున్న కేరళ మాజీ ఆరోగ్య మంత్రి, ఐద్వా అఖిల భారత అధ్యక్షురాలు పికె.శ్రీమతి
సమానతను సాధించుకుందాం.. ఐక్య ఉద్యమాలను బలపరుద్దాం..
ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఈనెల 8వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్లు ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమాదేవి తెలిపారు. శనివారం గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. కార్మికులకు 8 గంటల పని విధానం అమలు కోసం ఎందరో మహిళామణులు ప్రాణాలకు తెగించి పోరాడారని తెలిపారు. అశువులు బాసి పని గంటలు సాధించుకున్నారని అన్నారు. నాటి ధీర మహిళల పోరాట పటిమను స్ఫూర్తిగా పెంపొందించుకుని సమానత్వం సాధించుకోవడానికి ఐక్య ఉద్యమాలను బలపరచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఏటా మహిళా దినోత్సవం సందర్భంగా ఒక నినాదంతో జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ ఏడాది కూడా సమానతను సాధించుకుందాం- ఐక్య ఉద్యమాలను బలపరుచుదాం అనే నినాదంతో మహిళా దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. సమాజంలో నేటికీ మహిళలు వివక్షకు, హింసలకు, హత్యలకు గురవుతుండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. మహిళలను అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజు మాత్రమే గౌరవిస్తే సరిపోదన్నారు. ఒక్క రోజు గౌరవించి మిగతా రోజుల్లో అగౌరవపరచడం కాదన్నారు. నిత్యం మహిళలను గౌరవించుకోవడంతోనే సమానత్వం, మంచి సమాజంగా విరజిల్లుతుందన్నారు. ప్రపంచీకరణ, కార్పొరేటీకరణ జరిగిన తరువాత కార్మికులకు 14 గంటల పని విధానం అమలు చేస్తున్నారని చెప్పారు. పని ఒత్తిడికి గురవుతూ ఉద్యోగాలు మానివేయడం, మానసిక క్షోభకు గురవుతూ ఆత్మహత్యలకు పాల్పడటం వంటివి చోటు చేసుకుంటున్నాయని అన్నారు. 8 గంటల పని విధానం అమలు కోసం ఐక్యంగా పోరాడాలని, హక్కుల సాధన కోసం కూడా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. అందరినీ ఐక్యం చేయడమే లక్ష్యంగా మహిళా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐద్వా, యుటిఎఫ్, సిఐటియు, ఎడబ్ల్యూడబ్ల్యూయు, ఆశా, ఎండిఎం, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఎఐకెఎస్, ఎఐఎడబ్ల్యూయు సంఘాల ఆధ్వర్యంలో మార్చి 8వ తేదీన టిటిడి కల్యాణమండపంలో భారీ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్య వక్తగా కేరళ రాష్ట్రం మాజీ ఎంపీ, మాజీ ఆరోగ్య శాఖ మంత్రి పికె.శ్రీమతి హాజరవుతున్నారని తెలిపారు. జిల్లాలోని రచయితలు, మేధావులు, కవులు, కళాకారులు, మహిళలు, ఉద్యోగులు, విద్యార్థినీ విద్యార్థులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.నాగమణి, ఎస్.నాగేంద్రకుమార్, ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, ఐద్వా నగర కార్యదర్శి చంద్రిక, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ అర్బన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు జయభారతి, నాయకురాలు కాత్యాయని సెక్టోరియల్ నాయకులు యశోద, రామాంజినమ్మ, డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవాన్ని జయప్రదం చేద్దాం

మార్చి 8వ తేదీన టిటిడి కల్యాణమండపంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి పిలుపునిచ్చారు. శనివారం ఇస్కాన్ వద్ద కాలనీలో మహిళలతో సమావేశం నిర్వహించారు. కార్మికులు, శ్రామికులకు 8 గంటల పని విధానం అమలు కోసం, హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడుదామన్నారు. ప్రతి ఒక్కరూ పాల్గొని మహిళా దినోత్సవాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నగర కార్యదర్శి చంద్రిక, కాలనీలోని 300 మహిళలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ప్రశ్నించే వారికి అవకాశం కల్పించండి

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా విస్తృత ప్రచారం


పుట్టపర్తిలో ప్రచారంలో నాయకులు


రఘువీరారెడ్డిని ఓటు అభ్యర్థిస్తున్న నాయకులు

పుట్టపర్తి అర్బన్ : శాసనమండలిలో ఉద్యోగుల, ఉపాధ్యాయుల, నిరుద్యోగుల, ప్రజల సమస్యలను శాసనమండలిలో ప్రశ్నించే వారికి అవకాశం కల్పించాలని ప్రజాసంఘాల నాయకులు, యుటిఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో బ్యాంకులు, పాఠశాలల్లో పట్టభద్రులు, ఉపాధ్యాయులను కలిసి పిడిఎఫ్ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు, ఉపాధ్యాయ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి పిడిఎఫ్ తరపున పోటీ చేస్తున్నారన్నారు. వారిని గెలిపించాలని విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. విజ్ఞతతో తమ అమూల్యమైన ఓటును పిడిఎఫ్ అభ్యర్థులకు వేయాలని అభ్యర్థిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు ఇంతియాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్, నాయకులు రామకృష్ణ, బ్యాళ్ళ అంజి, పై పల్లి గంగాధర్, యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

మడకశిర : పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మాజీ మంత్రి రఘువీరారెడ్డి మద్దతు ప్రకటించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వరరావు, సిఐటియు సీనియర్ నాయకులు ఇంతియాజ్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్, జిల్లా అధ్యక్షులు జెడ్పీ శ్రీనివాసులు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : ప్రజల వాణిని శాసనసభలో వినిపించే నాయకులను గెలిపిద్దామని రైతుసంఘం నాయకులు కోరారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజుకు మద్దతుగా సిఐటియు, రైతు సంఘం, ఎస్ఎఫ్ఐ నాయకులు పట్టణంలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హరి మాట్లాడుతూ నిరుద్యోగ, యువతి, యువకుల, ఉద్యోగ ,ఉపాధ్యాయుల హక్కుల కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నించే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ , మండల కార్యదర్శి బాబావలి, ఎస్ఎఫ్ఐ నాయకులు హర్ష తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీఅభ్యర్థి కత్తి నరసింహారెడ్డికి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు కి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరుతూ విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ నియోజకవర్గ కార్యదర్శి శ్రీరాములు, ఎఐవైఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి కుళ్లాయప్ప, రైతు సంఘం నాయకులు హరి, ఎఐఎస్ఎఫ్ నాయకుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : పిడిఎఫ్ బలపపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థులు పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డికి మద్దతుగా ప్రజాసంఘాల నాయకులు కొత్త చెరువులో శనివారం ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులకు, ఉపాధ్యాయులను కరపత్రాలు పంపిణీ చేసి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు గంగాధర్, ముత్యాలు, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు ను గెలిపించాలని చేనేత, కార్మిక సంఘం, నాయకులు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఒకటవ సచివాలయం, కెనరా బ్యాంక్ నందు శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం మండల కార్యదర్శి రాజగోపాల్, చేనేత కార్మిక సంఘం మండల నాయకులు చంద్రశేఖర్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు బాలస్వామి, సోషల్ మీడియా ఇన్‌ఛార్జి శ్రీకాంత్, భవన నిర్మాణ మండల నాయకులు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయానికి సిపిఎం పట్టణ కార్యదర్శి నరసింహప్ప, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలిల ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని సచివాలయలల్లో, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో, కోర్టు ఆవరణంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. పిడిఎఫ్ బలపరుస్తున్న పశ్చిమ రాయలసీమ అభ్యర్థి పోతుల నాగరాజు, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డిలను గెలిపించాల్సిందిగా అందరిని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.


సోమందేపల్లిలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కలెక్టర్

పకడ్బందీగా రీ సర్వే పనులు : కలెక్టర్

ప్రజాశక్తి - చిలమత్తూరు

జగనన్న భూరక్ష పథకంలో బాగంగా ప్రభుత్వం నిర్వహించే రీసర్వే పనులను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ బసంత్‌కుమార్ పేర్కొన్నారు. రీ సర్వేలో భాగంగా భూ హద్దులు తెలియజేసే సర్వే రాళ్ల తయారీని టెండర్ల ద్వారా మండల పరిధిలోని పలు గ్రానైట్ పరిశ్రమలకు ప్రభుత్వం కేటాయించింది. ఈ నేప్యంలో సర్వే రాళ్ల కొలతలు, వాటి స్వరూపాన్ని కలెక్టర్ బసంత్‌కుమార్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రానైట్ యాజమాన్యాలకు రాళ్ల నాణ్యతపై పలు సూచనలు చేశారు. అనంతరం మండల పరిధిలోని దేమకేతేపల్లి గ్రామంలో సిపి పాయింట్‌ను పరిశీలించారు. సిపి పాయింట్ ఏర్పాటు ద్వారా డ్రోన్ డిజిటల్ మ్యాపింగ్ సులభతరం అవుతుందని ఈసందర్భంగా ఆయన చెప్పారు. అత్యంత పారదర్శంగా ఈ రీ సర్వే జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నాగరాజు, సర్వేయర్ సురేష్, ఎంపిడిఒ రాంకుమార్, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : మండలంలో భూ సర్వే పనులను సక్రమంగా చేపట్టాలని కలెక్టర్ బసంత్ కుమార్ ఆదేశించారు. శనివారం మండలంలోని పందిపర్తి గ్రామంలో జరుగుతున్న భూ సర్వే పనులను ఆయన పరిశీలించారు. సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. భూ సర్వే ద్వారా సమస్యలు తీరుతాయని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్వే జరిగేటప్పుడు తప్పనిసరిగా రైతులకు కూడా ఉండేటట్లు చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మాగే చెరువు గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న అమృత్ సరోవర్ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో మండల, జిల్లా సర్వేయర్లు, రెవిన్యూ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ సబ్ కలెక్టర్ చేతన్, తహశీల్దార్ మురళీకృష్ణ, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఏపీడీ శివానంద నాయక్, డిప్యూటీ తహశీల్దార్ శ్రీకాంత్, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

కండీషన్ లేని బస్సులతో ఇబ్బందులు

ప్రజాశక్తి మడకశిర రూరల్

కాలం చెల్లిన ఆర్టీసీ బస్సులతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పుట్టపర్తి నుండి మడకశిరకు సాయంత్రం 6 గంటలకు వస్తున్న మడకశిర డిపోకు చెందిన ఎపిఎస్ఆర్‌టిసి బస్సు పెనుగొండ రైల్వే స్టేషన్ సమీపంలోని గుట్ట వద్ద అర్ధాంతరంగా ఆగిపోయింది. దీంతో బస్సులో ఉన్న ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం వేళ ఇంటికి చేరుకోవలసిన ప్రయాణికులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కండిషన్ లేని బస్సులు నడపడం వల్లనే ఇలా జరుగుతోందని ప్రయాణికులు వాపోయారు. ఇప్పటికైనా డిపో అధికారులు నిర్లక్ష్యం వీడికండిషన్ ఉన్నబస్సులు నడపాలని కోరుతున్నారు.


మొరాయించిన ఆర్టీసీ బస్సు

కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - హిందూపురం

ప్రాక్టికల్స్ పరీక్షలు జరుగుతున్న సమయంలో విద్యార్థుల నుంచి అదనంగా ఫీజులు వసూలు చేసిన కార్పొరేట్, ప్రైవేట్ ఇంటర్మీడియట్ కళాశాలపైన విద్యాశాఖ అధికారులు వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని కళాశాల వసతిగృహం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాబావలి మాట్లాడారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇంటర్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ జరుగుతున్నాయని, కార్పొరేట్, ప్రవేటు కళశాల యాజమాన్యాలు ప్రాక్టికల్స్‌లో అధిక మార్కులు వేయిస్తామని చెప్పి, రసీదులు ఇవ్వకుండా ఒక్కొక్క విద్యార్థి నుంచి రూ.1500 నుంచి 2వేల రూపాయల వరకు ల్యాబ్ ఫీజు రూపంలో డబ్బులు వసూలు చేశారని విమర్శించారు. ఈ రకంగా వసూళ్లకు పాల్పడిన కళాశాలల పైన విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి అక్రమ వసుళ్ళకు పాల్పడిన కళాశాలల పైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చంద్రశేఖర్, రంగనాథ్, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

బాలసదన్ హాస్టల్‌ను తనిఖీ చేసిన జడ్జిలు

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణంలోని బాలసదన్ హాస్టల్‌ను సీనియర్ సివిల్ జడ్జి గీతావాణి, జూనియర్ సివిల్ జడ్జి రమ్యసాయి శనివారం తనిఖీ చేశారు.. ఏపీ రాష్ట్ర న్యాయసేవా అధికారసంస్థ ఆదేశాల మేరకు హాస్టల్‌ను తనిఖీ చేసినట్లు జడ్జిలు తెలిపారు. ఈ సందర్భంగా హాస్టల్లోని అన్ని గదులను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించడంతోపాటు వారి ఆరోగ్యపట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని వార్డన్‌కు సూచించారు. వివిధ చట్టాలు, బాలికల హక్కులపై జడ్జిలు విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది బాలాసుందరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

పుట్టపర్తి రూరల్ : మండల పరిధిలోని పెడపల్లి ఉన్నత పాఠశాలలో బిగ్ హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. మైనాస్వామి రచించిన విజయనగర సామ్రాజ్య సాంస్కృతిక వైభవానికి ప్రతీక "లేపాక్షి" "అనే ప్రయాణం, డ్రాయింగ్, మ్యాప్ పాయింటింగ్స్" పుస్తకాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బిగ్ హెల్ప్ స్వచ్ఛంద సంస్థ విద్యార్థులకు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి మండల అధ్యక్షుడు ఎవి. రమణారెడ్డి, మండల మాజీ కన్వీనర్ గంగాద్రి, పెడపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామచంద్రారెడ్డి, చెన్నారెడ్డి, నరసింహారెడ్డి, సోమశేఖర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

గాండ్లపెంట : మండల కేంద్రంలోని భగత్ సింగ్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్ఐ మల్లికార్జున రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రానికి వివిధ గ్రామాల నుంచి పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు ఉపయోగకరంగా ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షులు ఎం నరసింహులు, బాబు, షఫీ, నాగేంద్ర, శివ, శ్రీనివాసులు, కేశవ, ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు పుట్టపర్తిలో సైకిల్ ర్యాలీ

పుట్టపర్తి రూరల్: ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్వీ. కృష్ణారెడ్డి తెలిపారు. మహిళల్లో శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంచడం, వాతావరణాన్ని కాలుష్య రహితంగా మార్చడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఈ సైకిల్ ర్యాలీని ఉదయం 8 గంటలకు గణేష్ సర్కిల్లో కలెక్టర్ బసంత్ కుమార్ జెండా ఊపి ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సైకిల్ ర్యాలీ లో పుట్టపర్తి సమీప మండలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది, ఆశ, అంగన్వాడీ కార్యకర్తలు విద్యార్థులు, మహిళలు వారి వారి సొంత సైకిళ్లతో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన

బుక్కపట్నం : మండల కేంద్రంలోని గర్భిణులు, బాలింతలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది వ్యాధి నిరోధక టీకాలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ నివేదిత మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని, వ్యాధి నిరోధక టీకాలు క్రమం తప్పకుండా వేయించుకోవాలని, అంగన్వాడీ కేంద్రాల ద్వారా లభించే పోషకాహారాలు వైద్యుల సలహా మేరకు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ లింగారెడ్డి, సిబ్బంది విజయ్, మురళి గౌడ్, ఆరోగ్య కేంద్ర సిబ్బంది, అంగన్వాడీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పాడి పరిశ్రమతో ఉపాధి

కొత్తచెరువు: పాడి పరిశ్రమతో మహిళలు ఉపాధి పొందాలని పీఆర్డీఎస్ కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి సూచించారు. మండల పరిధిలోని లింగారెడ్డి పల్లిలో అమెరికాకు చెందిన వారి ఆర్థిక సహాయంతో పదిమంది మహిళలకు ఒక్కొక్కరికి 50వేల రూపాయలు రుణం మంజూరు చేసి ఆవులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ప్రభాకర్రెడ్డి మాట్లాడుతూ ఈ రుణాలను వడ్డీ లేకుండా పాడి రైతులకు అందిస్తున్నామన్నారు. ఈ ఆవులకు బీమా సౌకర్యం కూడా కల్పించామన్నారు. గతంలో మండల పరిధిలోని ఇగరంపల్లి, వంగంపల్లి గ్రామాల్లో మహిళలకు కూడా పాడిఆవులకు రుణాలు మంజూరు చేసినట్లు వివరించారు.

డిజిటల్ అసిస్టెంట్ నకిలీ హాజరు

రామగిరి : మండల పరిధిలోని దుబ్బార్లపల్లి సచివాలయం లో విధులు నిర్వహిస్తున్న డిజిటల్ అసిస్టెంట్ శరత్ ఆనంద్ ఫిబ్రవరి నెలలో విధులకు హాజరుకాకున్నా ఆన్లైన్లో వందశాతం హాజరైనట్లు చూపెడుతున్నారు. డిజిటల్ అసిస్టెంట్ మ్యానువల్ హాజరుపట్టికలో ఫిబ్రవరి నెలకు సంబంధించి ఒక్క రోజు కూడా హాజరైనట్లు లేదు. అంతేకాకుండా సెలవులో ఉన్నట్లు కూడా లేదు. ఆయన నెలలో ఒక రోజు కూడా విధులకు హాజరుకాలేదు. అయితే ఆన్లైన్లో మాత్రం ఆనంద్ వందశాతం విధులకు హాజరైనట్లు చూపెడుతోంది. ఈ విషయంపై ఎంపిడిఒ ఆజాద్ను వివరణ కోరగా డిజిటల్ అసిస్టెంట్ జనవరి 28 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు నెల రోజులు సెలవులో ఉన్నారని తెలిపారు. ఆన్లైన్లో వందశాతం హాజరు విషయం మీద విచారణ చేపట్టినట్లు ఎంపిడిఒ చెప్పారు.

ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించండి

చిలమత్తూరు : పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని తహశీల్దార్ నాగరాజు, ఎంపిడిఒ రాంకుమార్ కోరారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో అన్ని రాజకీయపార్టీలతో సమావేశాన్ని శనివార నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణపై వివరించారు. ఎన్నికల కోడ్ను ఉల్లంఘిస్తే చర్యలు ఉంటాయని, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయా రాజకీయ పార్టీల నాయకులు, ఎస్ఐ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు ఉపసంహరించుకోవాలి

కదిరి టౌన్ : గతవారం కదిరి పట్టణంలో చోటు చేసుకున్న ఘటనలో విధి నిర్వహణలో ఉన్న పాత్రికేయులపై పోలీసుల అక్రమ కేసులు బనాయించారని ఆ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని పాత్రికేయులు కోరారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవో రాఘవేంద్రకు శనివారం అందజేశారు.

రొద్దంలో వాహనదారుల ఇక్కట్లు

రొద్దం : మండల కేంద్రంలో శనివారం ట్రాఫిక్కు తీవ్ర అంతరాయం నెలకొంది. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పెనుగొండ పావగడ ప్రధాన రహదారి కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. శనివారం వారపు సంత కావడంతో ఈ రద్దీ మరింత పెరిగింది. వాహనదారులు రోడ్డుకి ఇరువైపులా ద్విచక్ర వాహనాలు వదలడంతో రోడ్డుపై వాహనాల రాకపోకలకు, జనం తిరగడానకి తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. కనీసం సంత రోజైన వాహనాలను ప్రధాన రహదారిపై ఉంచకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని పలువురు వాపోతున్నారు.

బత్తలపల్లిలో ఐడిడిఎస్ కొత్త ప్రాజెక్టు

బత్తలపల్లి : ఐసిడిఎస్ ప్రాజెక్టుల విస్తరణలో భాగంగా కొత్త ప్రాజెక్టుగా బత్తలపల్లిలో ఏర్పాటు చేసినట్లు సీడీపీవో సరస్వతి తెలిపారు. తాడిపత్రి రోడ్డులో గల భారతి మండల సమాఖ్య పాత కార్యాలయం పైభాగంలో తాత్కాలిక ప్రాజెక్టు ఆఫీసును ఏర్పాటు చేయనున్నట్లు ఆమె చెపాపరు. బత్తలపల్లి ప్రాజెక్టు కింద బత్తలపల్లి, తాడిమర్రి. ముదిగుబ్బ మండలాలు ఉంటాయన్నారు. గతంలో బత్తలపల్లి, తాడిమర్రి మండలాలు ధర్మవరం ప్రాజెక్టు పరిధిలోనూ, ముదిగుబ్బ కదిరి వెస్ట్ ప్రాజెక్టు పరిధిలోనూ ఉండేవన్నారు. ప్రస్తుతం బత్తలపల్లి ప్రాజెక్టును నూతనంగా ఏర్పాటు చేసి వాటిని అందులోకి మార్చినట్లు తెలిపారు. ఆనంతరం సిడిపిఒ ఆయా మండలాల్లోని సెక్టార్ లీడర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నూతన సీడీపీవోకు సూపర్వైజర్లు, అంగన్వాడీ వర్కర్లు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో సూపర్వైజర్లు చంద్రమ్మ, శైలజ, లలితమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాధితుడిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్సీ

గుడిబండ : గుడిబండ గ్రామానికి చెందిన వీరశైవ సంఘం కన్వీనర్, యువ నాయకుడు గుడిబండ దుర్గేష్ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి బాధితుడిని శనివారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కటకం శెట్టి ప్రభాకర్, శ్రీనివాస మూర్తి, జిల్లా నాయకులు మంజునాథ్, సుబ్బరాయుడు, శివకుమార్, డాక్టర్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి టూరిజం గెస్ట్ హౌస్ను

ప్రయివేటు వ్యక్తులకు ఇస్తే ఆందోళన


ఆందోళన చేస్తున్న గ్రామస్తులు, నాయకులు

లేపాక్షి : మండల కేంద్రం లోని టూరిజం గెస్ట్ హౌస్ నిర్వహణ ప్రయివేటు వ్యక్తులకు ఇస్తే ఆందోళనకు దిగుతామని టిడిపి నాయకులు హెచ్చరించారు. ఈ మేరకు వారు శనివారం స్థానిక టూరిజం గెస్ట్హౌస్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ లేపాక్షి టూరిజం గెస్ట్హౌస్ లాభాల బాటలో ఉందన్నారు. దీనిని ప్రైవేట్ వ్యక్తులకు లీజ్ ఇవ్వాలని ప్రభుత్వం టెండర్ పిలవటాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ కృషితో ఇక్కడ గెస్ట్హౌస్ను ఏర్పాటు చేశారన్నారు. యాత్రికులకు భోజనాలు, విశ్రాంతి గదులు ఏర్పాటు చేసి నష్టం వాటిల్లకుండా ప్రభుత్వ ఉద్యోగులు నడుపుతున్నారన్నారు. అయితే లాభల్లో ఉన్నదానిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవవటాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈసందర్భంగా తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ బసంత్కుమార్కు సమర్పించారు. స్పందించిన కలెక్టర్ ఈ విషయం తన పరిధిలో లేదని విషయాన్ని ఉన్నతధికారుల దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అంబికా లక్ష్మీనారాయణ, రామాంజినమ్మ, నాగరాజు, లేపాక్షి నాయకులు జయప్ప, సిరివరం కిష్టప్ప, నాగలింగారెడ్డి, ఆనంద్, జయకృష్ణారెడ్డి, మారుతి ప్రసాద్, అంజినప్ప, అభి, శ్రీరామిరెడ్డి, మాలక్క, రవి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సమక్షంలో

టిడిపిలో చేరిన ధర్మవరం వైసిపి నాయకులు

ధర్మవరం టౌన్ : వైసిపి ధర్మవరం పట్టణ మాజీ కన్వీనర్ గడ్డంకుళ్లాయప్ప తన అనుచరులతో శనివారం విజయవాడలోని మంగళగిరి టీడీపీ కార్యాలయంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సమక్షంలో టీడీపీలోకి చేరారు. ధర్మవరం పట్టణ వైసీపీ మాజీ కన్వీనర్ గడ్డంకుళ్లాయప్ప, పట్టణ మాజీ ప్రధానకార్యదర్శి అస్లాం, పట్టణ కోశాధికారి బడిగింజల రమణ, మాజీ జిల్లా స్టీరింగ్ కమిటి అధ్యక్షులు పటాన్అక్బర్, 25వ వార్డు వైసీపీ మాజీ ఇన్ఛార్జి మాధవరెడ్డిలను ధర్మవరానికి చెందిన ముఖ్యనాయకులు చింతలపల్లి మహేశ్ చౌదరి, ఫణికుమార్, నాగూరుస్సేన్, చింతపులుసు పెద్దన్న చంద్రబాబు వద్దకు పిలుచుకుని వెళ్లారు. ఈ మేరకు శనివారం మంగళగిరి కార్యాలయంలో వారికి చంద్రబాబునాయుడు పార్టీ కండువా వేసి పార్టీకి సాధారంగా ఆహ్వానించారు. రాబోవు ఎన్నికలలో టీడీపీ గెలుపే లక్ష్యంగా కృషిచేయాలని చంద్రబాబునాయుడు సూచించినట్లు గడ్డంకుళ్లాయప్ప తెలిపారు.


చంద్రబాబు సమక్షంలో టీడీపీలోకి చేరుతున్న ధర్మవరం వైసీపీనాయకులు

ఐసిడిఎస్ కొత్త ప్రాజెక్టులకు మౌలిక వసతులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లాలో నూతనంగా ఆరు ఐసిడిఎస్ కొత్త ప్రాజెక్టులకు సీడీపీఓలను నియమించామని వారు ఒకటవ తేదీ నుండి ఆయా ప్రాజెక్టులలో విధులు నిర్వహిస్తున్నారని వారికి ఆయా కేంద్రాలలో ఆఫీసు ఏర్పాటు తదితర మౌలిక వసతులు కల్పించుకోవాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమ సాధికారిత అధికారిని లక్ష్మీ కుమారి తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో శ్రీ సత్య సాయి జిల్లాలో ఏడు ప్రాజెక్టులుండగా నూతనంగా కదిరి వెస్ట్ ప్రాజెక్టును ఓడిసి ప్రాజెక్టులో కలిపామన్నారు. మిగిలిన ఐదు ప్రాజెక్టులు నూతనంగా ఏర్పాటు చేశామని వాటికి సిడిపిఒలను నియమించామని తెలిపారు. బత్తలపల్లికి సిడిపిఒగా ఎస్ సరస్వతి, గుడిబండకు ఎఎల్. ప్రభావతి, సోమందేపల్లికి అనురాధ. ఓడి చెరువుకు ఎస్ వరలక్ష్మి, పుట్టపర్తికి వి. గాయత్రి, నల్లచెరువుకు వి. ప్రభావతిని సిడిపివోలుగా నియమించామన్నారు. ప్రభావతి ఇక్కడ జాయిన్ అయి విశాఖపట్నం అనకాపల్లిలో డిప్యుటేషన్పై విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నూతనంగా ఏర్పడిన ప్రాజెక్టులకు ఆఫీసు, తదితర మౌలిక వసతులు కల్పించుకోవాలని సిడిపిఒలకు ఆదేశాలు జారీ చేసినట్లు ఆమె తెలిపారు.

విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి-హిందూపురం

విద్యార్థులు శాస్త్ర, సాంకేతికతను పెంపొందించుకొని గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలని హెచ్ఎం ప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం మండల పరిధిలోని కిరికెర ఎల్ఆర్జి విద్యాలయంలో నిర్వహించిన సైన్స్ఫేర్ను ఆ పాఠశాల హెచ్ఎం ప్రసాద్ ప్రారంభించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు రూపొందించిన వివిధ ప్రాజెక్టులను పరిశీలించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన వివిధ ప్రాజెక్టు ప్రదర్శనలు ఆలోచింపజేశాయి. ఈ కార్యక్రమంలో ఎఎ సంజీవరెడ్డి, ఉపాధ్యాయులు మారుతి, అంజాద్బాషా, ఈశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.



తయారు చేసిన నమూనాలు ప్రదర్శిస్తున్న విద్యార్థి

న్యాయం చేయండి

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన కూరగాయల మార్కెట్ భవన సముదాయంలోనే వ్యాపారాలు జరిగేలా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని న్యూ వెజిటబుల్ మార్కెట్ నూతన సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి నరసింహులు, గౌరవాధ్యక్షుడు మునిరాజు, జాయింట్ సెక్రటరీ ఇర్ఫాన్ బాషా, మురళి కోరారు. ఈ మేరకు వారు శనివారం స్థానిక ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. వంద షాపులతో నూతనంగా కూరగాయల మార్కెట్ నిర్మించారని, వాటిని వేలం పాట ద్వారా దక్కించుకుని లక్షల రూపాయలు అడ్వాన్సు చెల్లించామన్నారు. అయితే వ్యాపారాలు జరగక అద్దెలు సైతం చెల్లించలేని పరిస్థితి నెలకొందన్నారు. తాము పూర్తిగా నష్టపోయామన్నారు. తోపుడుబండ్ల వ్యాపారులు ఎక్కడబడితే అక్కడ వ్యాపారాలు నిర్వహిస్తున్నారని, పార్కింగ్ స్థలంలోనూ వ్యాపారాలు చేస్తున్నారన్నారు. దీనికి తోడు రైతు బజార్లో వ్యాపారాలు నిర్వహిస్తున్నారన్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్, అధికారులు స్పందించి రైతుబజార్లో, అలాగే మార్కెట్కు 2 కిమీల పరిధిలో ఎలాంటి తోపుడుబండ్లు లేకుండా చేసి, మార్కెట్లోనే మొత్తం వ్యాపారాలు జరిగేలా చూడాలన్నారు. అదేవిధంగా ఈ విషయాన్ని ఎమ్మెల్సీ ఇక్బాల్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

18న లోక్అదాలత్

హిందూపురం : వైవాహిక సంబంధ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 18వ తేదీన ప్రత్యేక లోక అదాలత్ నిర్వహిస్తున్నామని దీనిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జడ్జి శైలజ తెలిపారు. శనివారం స్థానిక కోర్టులో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాకుండా కోర్టుల చుట్టూ తిరుగుతున్న ఆయా వర్గాల వారు సమస్యలను సామరస్యంగా రాజీమార్గంలో పరిష్కరించుకోవచ్చని అన్నారు. ఈ సమావేశంలో ఎజిపి శ్రీనివాస్ రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు నాగప్ప, న్యాయవాదులు సిద్దు, రవికుమార్, అబ్దుల్లా, లోక్ అదాలత్ హేమావతి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి

కొత్తచెరువు : ఉపాధి పథకం కింద చేపట్టే పనులను గ్రామీణ ప్రాంతాల ప్రజలు వ్యవసాయ కూలీలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ బసంత్ కుమార్ కోరారు. మండల పరిధిలోని బైరాపురం గ్రామపంచాయతీలో జరుగుతున్న అమృత్ సరోవర్ ఉపాధి పనులను ఆయన శనివారం పరిశీలించారు. వేసవికాలంలో వలసలు వెళ్ళకుండా కూలీలు ఈ పనులను ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీడీ రామాంజనేయులు ఏపీడీ రఘునాథరెడ్డి, ఏపీవో నాగిరెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

వైసిపికి చరమగీతం పాడుదాం : పరిటాల శ్రీరామ్


విలేకర్ల సమావేశంలో పాల్గొన్న నాయకులు

ధర్మవరం టౌన్ : ఎమ్మెల్సీ ఎన్నికలే తొలిమెట్టుగా భావించి రాష్ట్రంలో వైసిపికి చరమగీతం పాడుదామని టిడిపి ధర్మవరం నియోజకవర్గ ఇన్ఛార్జి పరిటాల శ్రీరామ్, గుంటూరు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కొమ్మలపాటి శ్రీధర్ టిడిపి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. టిడిపి స్థానిక కార్యాలయంలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడారు.. వైసీపీ అధికారంలోకి వచ్చిప్పటి నుంచి ప్రభుత్వ ఉద్యోగులతోపాటు నిరుద్యోగులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉద్యోగాలు ఇస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిఅధికారం చేపట్టాక వారిని మోసం చేశారన్నారు. చేనేత రంగానికి చెందిన వారు చాలా మంది సొంత వృత్తిని వదులుకోలేక తిరిగి స్వగ్రామానికి వచ్చి మగ్గంపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. అయితే వైసీపీ ప్రభుత్వంలో చేనేతలకు ఒక్క సబ్సీడీ కూడా ఇవ్వలేదన్నారు. ఇక ఉపాధ్యాయుల పరిస్థితి చూస్తే వారిచేతనే పాఠశాలలో చేయలేని పనులు చేయిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను యువత, ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఎన్నికల ద్వారా చూపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కమతంకాటమయ్య, చారుగుండ్ల ఓబుళేశు, పరిశే సుధాకర్, పురుషోత్తంగౌడ్, సాహెబ్బీ, బీబీ, కృష్ణాపురం జమీర్ అహమ్మద్, గరుగువెంగప్ప, భీమనేని ప్రసాద్ నాయుడు, పల్లపురవీంద్ర, బిల్లే శీన, ఇర్షాద్, గొట్లూరు రహీం, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

సామాన్యుల గొంతుకగా పిడిఎఫ్ అభ్యర్థులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ప్రోగ్రసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) అభ్యర్థులంటే సామాన్య గొంతుక అని చెప్పాలి. మండలి ఎన్నిల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి పట్టభద్రుల, ఉపాధ్యాయ మండలి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులు పనితీరు ఇందుకు నిదర్శనమని చెప్పాలి. రాయలసీమ పశ్చిమ పట్టభద్రుల నియోజకవర్గంలోనూ ఇదే రకమైన ఒరవడిని పిడిఎఫ్ అభ్యర్థులు కనబరుస్తూ వస్తున్నారు. ధన, అధికార బలాన్ని ఎదుర్కొని విజయం సాధించడమే కాకుండా పదవీ కాలమంతా సామాన్య ప్రజల సమస్యలపై గొంతెత్తే వారిగా ఉంటూ వస్తున్నారు. ఇప్పుడు కూడా రాయలసీమ పశ్చిమ నియోజకవర్గానికి జరుగుతున్న ఎన్నికలకు పిడిఎఫ్ అభ్యర్థులు బరిలో నిలిచారు. పట్టభద్రులకు పోతుల నాగరాజు, ఉపాధ్యాయ నియోజకవర్గానికి కత్తి నరసింహారెడ్డిలు నామినేషన్ల దాఖలు చేశారు. నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణలు కూడా మగిశాయి. ప్రచారాలు ఊపందుకున్నాయి. మొత్తం 49 మంది అభ్యర్థులు పట్టభద్రుల బరిలో నిలిచారు. 12 మంది ఉపాధ్యాయ నియోజకవర్గానికి పోటీలో ఉన్నారు. పట్టభద్రుల నియోజకవర్గానికి వచ్చినప్పుడు చాలా మంది అధికారపార్టీకి డమ్మీలుగా బరిలో ఉన్నట్టు విమర్శలున్నాయి. అదనంగా ఏజెంట్లు, వాహనాల కోసం కొంత మందిని నామ మాత్రపు బరిలో నిలిపి ఎన్నికల సమయంలో వారి మనుషులను అదనపు ఏజెంట్లుగా పంపి లబ్ధిపొందాలన్న యోచనతోనే కొంత మందిని డమ్మీ అభ్యర్థులను బరిలో నిలిపారు. ఇది ఇలాగుంటే నామినేషన్ల ప్రక్రియ మొత్తం పూరవడంతో ఇప్పుడు ప్రచారాల హోరు మొదలైంది. అటు అధికార, ఇటు ప్రతిపక్ష పార్టీ అభ్యర్థులతోపాటు, పిడిఎఫ్ అభ్యర్థులూ ప్రచారాలు జోరుగా సాగిస్తున్నారు. వైసిపి అభ్యర్థి తరుపున ఎమ్మెల్యేలు, మంత్రులు పెద్దఎత్తున ప్రచారాలు చేస్తుండగా,టిడిపి అభ్యర్థుల తరుపున నియోజకవర్గ నాయకులు ప్రచారాలు చేస్తున్నారు. పిడిఎఫ్ అభ్యర్థుల తరుపున కార్మిక సంఘాలతోపాటు, ఉద్యోగ, కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నారు. గ్రామ గ్రామాన కూడా కార్మికులు పిడిఎఫ్ అభ్యర్థుల తరపున ప్రచారం చేస్తున్నారు. దీనికితోడు ఇప్పటికే కాంగ్రెసు,జనసేన పార్టీలు మద్దతు ప్రకటించాయి. రోజురోజుకు మద్దతు పెరుగుతోంది. ఇదే సమయంలో రాయలసీమ ప్రాంతంలోని అనేక సమస్యలను చర్చకొచ్చే విధంగా పిడిఎఫ్ అభ్యర్థులు గళమెత్తుతున్నారు. గతంలోనూ ఈ సమస్యలపై పిడిఎఫ్ అభ్యర్థులు పోరాటాలు చేసిన దాఖలాలున్నాయి. పెరుగుతున్న మద్దతును చూసి ఏదో ఒక రకంగా అధికార, ధన బలంతో గెలుపొందేందుకు అధికార వైసిపి ప్రయత్నాలను ఇప్పటి నుంచే ఆరంభించిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉపాధ్యాయ ఓటర్లను ప్రలోభ పెట్టే ప్రక్రియ ప్రారంభించినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా ప్రయివేటు టీచర్లకు గాలమేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. దీనికి ధీటుగా ప్రజలను సమీకరించేందుకు పిడిఎఫ్ మద్దతుదారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రజా సమస్యలపై గళమెత్తే వారిని మండలికి పంపించాలన్న కృతనిశ్చయంతో కార్మికులు, ఉద్యోగులు పిడిఎఫ్కు మద్దతుగా ప్రచారాలు చేస్తున్నారు.



నేరాలు ఘోరాలు

వ్యక్తి ఆత్మహత్య

గోరంట్ల : మండలంలోని చింతమానుపల్లికి చెందిన వ్యక్తి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు... గ్రామానికి చెందిన సూరప్ప (54) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో జీవితంపై విరక్తి చెందిన సూరప్ప గ్రామ సమీపంలోని చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ సుబ్బరాయుడు తెలిపారు.

పట్టపగలే గ్రానైట్స్ దుకాణంలో చోరీ

ధర్మవరం టౌన్ : పట్టణంలోని గ్రానైట్స్ షాపులో పట్టపగలు ఓ దొంగ రూ.3లక్షలకుపైగా నగదును చోరీ చేశాడు. బాధితుడు తెలిపిన వివరాలు... పట్టణంలోని టీవీఎస్ షోరూం ఎదురుగా ఉన్న ఆలియా గ్రానైట్స్ షాపులో యజమాని నూర్ మహమ్మద్ టేబుల్ డ్రాలో శనివారం రూ. 3లక్షలకుపైగా నగదు ఉంచాడు. గ్రానైట్స్ వేసుకుని లారీ లోడ్ రావడంతో షాపు యజమానితోపాటు పనిచేసే కూలీలు సైతం లారీలో ఉన్న గ్రానైట్స్ లోడును దింపేందుకు బయటకు వెళ్లారు. కూలి పనిచేసేవాడిగా వచ్చిన దొంగ షాపులో ఎవరూ లేరని గమనించి తన ముఖానికి టవల్ వేసుకుని కౌంటర్ వద్దనున్న టేబుల్ డ్రాను ఓపెన్ చేసి అందులో ఉన్న రూ. 3లక్షలకుపైగా నగదును తన బనియన్లో పెట్టుకుని బయటకు వెళ్లిపోయాడు. లారీలోని గ్రానైట్ దింపేసి వచ్చిన షాపు యజమాని డబ్బులు ఇచ్చేందుకు టేబుల్ డ్రా ఓపెన్ చేయగా అందులో డబ్బులు కనిపించలేదు. దీంతో దొంగతనం జరిగిందని గ్రహించిన యజమాని సీసీ కెమెరాను చెక్ చేయగా ఓ దొంగ చేసిన చోరీ రికార్డు అయింది. వెంటనే వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు సీసీ కెమెరా పుటేజీని స్వాధీనం చేసుకున్నారు. దొంగ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి

సోమందేపల్లి : మండల పరిధిలోని వెలకమాకులపల్లి వద్ద గల 44వ జాతీయ రహదారి పైన శనివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతిచెందారు. స్థానికులు తెలిపిన వివరాలు... గోరంట్ల మండలం గుమ్మయ్య గారి పల్లికి చెందిన ఎర్రిస్వామి (45) వరలక్ష్మి (40) ద్విచక్ర వాహనం మీద వెళుతుండగా బెంగళూరు వైపు నుంచి వస్తున్న టిప్పర్ వెనకనుంచి వీరి వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో దంపతులిద్దరూ అక్కడికక్కడే మృతిచెందాడు. ట్రిపర్ డ్రైవర్ నిద్ర మత్తులో ఉండటమే ఈ ప్రమాదానికి కారణంగా భావిస్తున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పేకాట జూదరులు అరెస్టు

గుడిబండ : మండల పరిధిలోని సీసీ గిరి గ్రామం శివారులో ఉన్న బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతున్న వారిని పోలీసులు అరెస్టు చేఆరు. గుడిబండ, రొళ్ల మండలాలకు చెందిన 16 మందిని అరెస్ట్ చేసి వారి నుండి 2,17,970 రూపాయలు నగదును, పేకముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మునిప్రతాప్ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

కదిరి టౌన్ : కదిరి రూరల్ మండలం కుమ్మర వాండ్ల పల్లి పంచాయతీ గంగనగారిపల్లిలో రాముల గుడి కళ్యాణోత్సవం కోసం వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్ విరాళం అందజేశారు. ఈ మేరకు రూ.50వేల నగదును అందజేశారు. అదే విధంగా కుమ్మర వాండ్ల పల్లి లో జరుగుతున్న ఇస్తిమాకు విచ్చేసిన భక్తుల కోసం మాజీ సర్పంచి బత్తల వెంకటరమణ చేతుల మీదుగా మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు . ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న నాయకులు

హంస వాహనంపై కాటమరాయుడు

కదిరి అర్బన్ : ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం మూడవరోజు భూదేవి, శ్రీదేవి మధ్య కాటమరాయుడు తీరువీధుల్లో ఊరేగాడు. ఈసందర్భంగా స్వామివారిని రకరకాల పుష్పాలతో అలంకరణ చేశారు. బ్రహ్మోత్సవాలకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేశామని ఆలయ ఈవో పట్టం గురుప్రసాద్, పాలకమండలి చైర్మన్ గోపాలకృష్ణ తెలిపారు.

విధి నిర్వహణలో అలసత్వం తగదు

పుట్టపర్తి రూరల్ : సచివాలయాల అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పని ఎంపిడిఒ ఆశోక్కుమార్రెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు ఆయన శనివారం మండలంలోని జగరాజుపల్లి, వెంకట గారి పల్లి సచివాలయాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా పంచాయతీ సెక్రటరీలు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు, వీఆర్వోలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు,డిజిటల్ అసిస్టెంట్లు, సచివాలయ పోలీసులు, వాలెంటీర్లతో సమావేశమయ్యారు. సచివాలయంలో ప్రజలకు అందాల్సిన పథకాలు అందుతున్న తీరును, పెన్షన్ల పంపిణీ తదితర వాటిపై సమీక్షించారు.

'అవినీతిపై ప్రశ్నించినందుకే కక్ష సాధింపు'

పరిగి : మండలంలోని కోడిగెనహల్లి ఎపి గురుకుల కళాశాలలో చోటు చేసుకున్న అవినీతి అక్రమాలు ప్రశ్నించినందుకే తనను విధుల నుంచి తొలగించారని తనకు న్యాయం చేయాలని అదే కళాశాలలో పనిచేస్తున్న ఉద్యోగి సుజాత కోరారు. ఈ మేరకు ఆమె తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని హిందూపురం ఇన్ఛార్జి తహశీల్దార్ సౌజన్యలక్ష్మికి శనివారం అందజేశారు. కళాశాలలో కాంటాక్ట్ బేసిక్ మీద పనిచేస్తున్న తాను ప్రిన్సిపల్ శ్రీనివాసరావు చేస్తున్న అవినీతి అక్రమాలను ప్రశ్నించినందుకే తొలగించారని విమర్శించారు. అంతేకాక కళాశాలలో తాను విద్యార్థులపై అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయురాలిపై కుల దూషణకు పాల్పడినట్లు సృష్టించి తనను తొలగించారని తనకు న్యాయం చేయాలని ఆమె కోరారు.

విలువలతో కూడిన విద్య అవసరం

పెనుకొండ : విలువలతో కూడిన విద్య ఎంతో అవసరం అని పెనుకొండ సబ్ కలెక్టర్ కె. కార్తీక్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ప్రగతి, గ్లోబల్ జైన్ పాఠశాలల 36వ వార్షికోత్సవాన్ని విద్యాసంస్థల అధినేత యు. శ్రీనివాసులు, కరస్పాండెంట్ మంజువాణి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సబ్ కలెక్టర్తో పాటు డివైఇఒ రంగస్వామి, కర్నాటక బ్యాంక్ మేనేజర్ దీపిక, యూనియన్ బ్యాంక్ మేనేజర్ నాగేశ్వర రావు, నేషనల్ హ్యూమన్ రైట్స్ డిస్ట్రిక్ట్ అబ్జర్వర్ జాన్ ప్రియనాథ్, జాబిలి మాసపత్రిక సంపాదకులు జాబిలి జయచంద్ర తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ విద్యతో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు సజన, సాయి శ్రీధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు సింహవాహనంపై శ్రీవారు

కదిరి టౌన్ : శ్రీమద్ ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారు ఆదివారం సింహ వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ ఉత్సవానికి బెంగళూరుకు చెందిన ఎంవి దాసప్ప కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించ నున్నారు.

అదనంగా డబ్బులు చెల్లించొద్దు

పుట్టపర్తి అర్బన్ : వాహనంలో ఇంటి వద్దకే వచ్చే గ్యాస్ కోసం మునిసిపాలిటీ పరిధిలోని గ్యాస్ వినియోగదారులు అదనంగా డబ్బులు చెల్లించవద్దని ప్రశాంతి గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు వారు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 2న గ్యాస్ ధర పెరిగిన కారణంగా ఇంటి దగ్గరకు వచ్చే ఇండియన్ గ్యాస్ వినియోగదారులు 5 కిలోమీటర్ల పరిధిలో 1175 రూపాయలు మాత్రమే చెల్లించాలని కోరారు. అంతకుమించి గ్యాస్ సిలిండర్కు డబ్బులు చెల్లించవద్దన్నారు.

అధైర్యపడొద్దు... ఆదుకుంటాం

హిందూపురం : పురపాలక సంఘ పరిధిలోని 1వ వార్డు ఇందిరమ్మ కాలనీకి చెందిన విశ్వనాథ్ రెడ్డి సులోచన దంపతుల కుమార్తె చిన్నారి పూజిత గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. చిన్నారికి సరిగా వైద్యం చేయించడానికి తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని స్థానిక నాయకుడు శివశంకర్ రెడ్డి ఎమ్మెల్సీ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్సీ చిన్నారి వైద్య సేవల కోసం రూ.20వేలను అందజేశారు. చిన్నారి వైద్య సేవల కోసం ఎంత ఖర్చు అయిన తానే భరిస్తానని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్ జబివుల్లా తదితరులు పాల్గొన్నారు.